విశాఖపట్టణం
బుధవారం 19 ఆగస్టు 2026

For a pure tomorrow..


# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 207 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోవ్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ ..మిగతా 2లో



## అలిగారా..? అనారోగ్యమా..!

### పవన్ గైర్హాజరుకు కారణమేంటి

### నాలుగు కేబినెట్ సమావేశాలకు డుమ్మా

### భోగాపురం ఎయిర్ పోర్టుకు మాత్రమే హాజరు

### సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రారంభోత్సవానికి మొహంచాటు

### డిప్యూటీ సీఎం వ్యవహార తీరుపై కూటమిలో గుసగుస

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

మరో 15ఏళ్లు కూటమి అధికారంలో ఉంటుంది, ప్రతి వేదికపై నేతలు చెబుతున్న మాట. కానీ లోలోపల మాత్రం చాలా గడబిడ జరుగుతోందని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యవహార శైలి ఈ విభేదాలను ఎత్తి చూపుతోంది. ఆయన వరుసగా నాలుగు సార్లు ..మిగతా 2లో


# మేయర్ ప్రత్యక్ష ఎన్నిక

### మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో కూడా

### అక్టోబర్‌లోగా ఎన్నికల పూర్తికి ఏర్పాట్లు

### అధికారులకు కేబినెట్ ఆదేశాలు





(అమరావతి - జయజయహే)

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలకమైన మరియు ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మొత్తం 57 అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం.... వాటికి ఆమోదం తెలుపుతూ పచ్చజెండా ఊపింది. ఈ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ.... వాటిని చట్టబద్ధంగా అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని (రూరల్) స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా, పట్టణ ప్రాంతాల్లో (అర్బన్) 33.13 శాతం రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. బీసీ సామాజిక వర్గాలకు రాజకీయంగా సరైన గుర్తింపు, అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో చాలా రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉన్న అనిశ్చితికి కేబినెట్ తెరదించింది. రాబోయే అక్టోబర్ ..మిగతా 2లో

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్




### పెండింగ్‌లో 89 కేసులు

### చంద్రబాబుపై 19 కేసులు

### సుప్రీంకోర్టుకు పిల్ నివేదిక

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఏకంగా 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తాజాగా అందిన ఒక నివేదిక సంచలనం సృష్టించింది. చట్టసభల్లో కూర్చుని చట్టాలను చేయాల్సిన నాయకులే నేరారోపణలు ఎదుర్కోవడం మన దేశ రాజకీయాల్లో మరోసారి చర్చాంశంగా మారింది. దేశంలో ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిల్ విచారణలో భాగంగా, కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సారియా ఈ రిపోర్టును సమర్పించారు. బీజేపీ నాయకుడు, లాయర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వేసిన ఈ పిటిషన్ రాజకీయ వర్గాల్లో ఇప్పటికే తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో ..మిగతా 2లో

## వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

### సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు

### కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే: :



కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ..మిగతా 2లో

## 4 మృతదేహాలు.. 9 పుర్రెలు..!

### మట్టి తవ్వకాల్లో గుర్తింపు

### బెంబేలెత్తిన జనం

### శ్మశాన వాటిక నుంచి తెచ్చిన మట్టిగా అనుమానం

### దర్యాప్తు చేస్తున్న పోలీసులు

(విశాఖపట్నం - జయజయహే)

విశాఖ నగరంలో మృతదేహాలు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. రోడ్డు మరమ్మతుల కోసం మట్టిని తరలిస్తుండగా.. నాలుగు మృతదేహాలు, తొమ్మిది మానవ పుర్రెలు బయటపడటం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖలోని షీలానగర్ జంక్షన్ వద్ద పోర్టు కనెక్టివిటీ రోడ్డు ..మిగతా 2లో



## ఈసారి ఖేల్ రత్నలు లేరు..!

### గాయిత్రి, శ్రీకాంత్‌లకు అర్జున అవార్డులు

### మొత్తంగా 17 మందికి పురస్కారాలు

### నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ ప్రకటించిన కేంద్రం



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ..మిగతా 2లో


## దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

### ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..

### సోషల్ మీడియాలో ఉత్పన్నం

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు ..మిగతా 2లో



# అలిగారా..? అనారోగ్యమా..!

మొదటి పేజీ తరువాయి...

కేబినెట్ సమావేశాలకు గైర్హాజరయ్యారు. ఆరోగ్య కారణాలతో సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం రోజు తప్ప ఈ మధ్య కాలంలో పవన్, చంద్రబాబు వేదిక పంచుకున్న కార్యక్రమం ఒకటీ లేదు. ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై నిర్వహించిన మంత్రిమండలి భేటీకి దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఇది ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశమైంది. ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతూ ఆమోదం తెలిపేందుకు మంత్రులు చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గైర్హాజరయ్యారు. ఫీవర్ కారణంగానే ఆయన ఈ భేటీలో పాల్గోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆరోగ్యం బాగాలేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నప్పటికీ దీని వెనుక బలమైన కారణం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కీలకమైన సమావేశాలకు పవన్ కల్యాణ్ డుమ్మా కొట్టడం చాలా కాలం నుంచి సాగుతోంది. ఇప్పుడు వారం పది రోజుల్లోనే మూడు నాలుగు కీలక భేటీలకు ఆయన హాజరుకాలేదు. దీంతో తెలుగుదేశంతో జనసేనానికి విభేదాలు వచ్చాయా అన్న ప్రశ్నలు మొదలయ్యాయి. సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు అసెంబ్లీ కీలక అంశాలపై చర్చించారు. అందులో ఒకటి డీఎస్సీ ఆరోపణలపై ప్రభుత్వం చర్చ ప్రారంభించింది. ఇది కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు సంబంధించిన అంశం.



దీనికి కూడా ఉప ముఖ్యమంత్రి రాలేదు. గత వారం అమరావతిలో కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవంలో కూడా పవన్ కల్యాణ్ పాల్గొనలేదు. ఆయన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. అదే రోజు విశాఖలో జరిగిన ఏనుగుల దినోత్సవంలో పవన్ పాల్గొన్నారు. తన భుజం సర్జరీ, తన తల్లి అనారోగ్యం కారణంగా కేబినెట్ భేటీలకు రాలేదు. తర్వాత ఒకసారి నడుంనొప్పి ఉందని కూడా మంత్రివర్గం సమావేశం జరుగుతుండగానే మధ్యలోనే వెళ్లిపోయారు. పదే పదే కీలక సమావేశాలకు పవన్ డుమ్మా కొడుతుండటంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు దేశంపై పవన్ కల్యాణ్ అలిగారని ప్రచారం జరుగుతోంది. కీలకమైన నేతతో ఆయనకు విభేదాలు ఉన్నాయని అంటున్నారు. ప్రశ్న రావణ్ అరెస్టు లాంటి విషయాల్లో తెలుగుదేశం తీసుకున్న స్టాండ్‌తో పవన్ విభేదించినట్టు తెలుస్తోంది. రావణ్‌కు పదే పదే బెయిల్ వస్తుండటం, పోలీసులు సరిగా వ్యవహరించలేదని కూడా అన్నట్టు సమాచారం. ఈ విషయంలో సీరియస్‌గా ఉండకపోతే తన సెక్యూరిటీని వెనక్కి తీసుకోవాలని వార్నింగ్ ఇచ్చినట్టు కూటమి వర్గాలు చెబుతున్నాయి. పవన్ మొదటి నుంచి లా అండ్ ఆర్డర్ విషయంలో అభ్యంతరాలు చెబుతూనే ఉన్నారు. తన చేతిలో ఉండి ఉంటే వైసీపీ నాయకులకు చుక్కలు చూపించేవాడినని ఆయన స్వయంగా అన్నారు. అనిత పని తీరుపై కూడా ఆయన అసంతృప్తిగా ఉన్నారని అందుకే ఆ శాఖను టార్గెట్ చేసినట్టు చెబుతున్నారు.

పవన్ కల్యాణ్‌కు ఇబ్బంది లేకుండా, కోపం రాకుండా ఉండేందుకు చంద్రబాబు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే మంత్రిపదవి ఇవ్వలేని పరిస్థితుల్లో నాగబాబుకు మంత్రి హోదాలో ఉండేలా ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ పదవి ఇచ్చారని టాక్. ఇదంతా కూడా పవన్‌ను సంతృప్తిపరిచే పనిలో భాగమని అంటున్నారు. గతంలోనే నాగబాబుకు మంత్రిపదవి ఇస్తానని బహిరంగ వేదికపై చంద్రబాబు ప్రకటించారు. కానీ ఇంత వరకు అది చేయలేదు. అందుకే ఆ విషయంలో పవన్‌కు కోపం వచ్చిందేమో అని నాగబాబుకు కీలక పదవి అప్పగించారు. ఎన్ని చేసినా ప్రస్తుతానికి ఉప ముఖ్యమంత్రి శాంతించడం లేదని తెలుస్తోంది. అందుకే కీలకమైన సమావేశాలకు ఆయన రావడం లేదని సమాచారం. ఎక్కడెక్కడో జరిగిన ప్రారంభోత్సవాలకు, ఇతర ఈవెంట్లకు సోషల్ మీడియాలో పెట్టి చప్పట్లు కొట్టే పవన్ కల్యాణ్, రాజధాని అమరావతి సీడ్‌యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సానికి సంబంధించి ఒక్క ట్వీట్ చేయలేదు. ఇవన్నీ చూస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య ఉన్న విభేదాలు ఇప్పట్లో చల్లారేలా లేవని అంటున్నారు.

# ఈసారి ఖేల్ రత్నలు లేరు..!

మొదటి పేజీ తరువాయి...

జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది.

**17 మందికి అర్జున అవార్డులు.. విదిత్, దివ్య, గాయత్రికి పురస్కారాలు**

గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది.

కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు. లైఫ్‌టైమ్ కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ లకు ద్రోణాచార్య దక్కింది. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసిన కార్పొరేట్, ఎన్జీవో విభాగంలో అందించే రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం పూణేకు చెందిన ఆర్మీ పారాలింపిక్ నోడ్ కు లభించింది. ఖేల్ రత్న అవార్డు లేకపోవడం మినహా మిగతా విభాగాల్లో పెద్ద సంఖ్యలోనే భారతీయ క్రీడాకారులకు గుర్తింపు లభించింది.

# క్రిమినల్ కేసుల్లో రేవంత్ టాప్

మొదటి పేజీ తరువాయి...

సుమారు 251 మందిపై, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.



**ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..**

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 4,192 కేసుల్లో 519 కేసులు పదేళ్లకు పైగా కోర్టుల గడప దాటలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో 700 కేసులు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. అందులో 260 కేసులు మూడేళ్లుగా ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఈ కేసుల్లో ఇంకా ఛార్జిషీట్లు కూడా దాఖలు కాలేదు. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం.. కేరళకు చెందిన ఎంపీల్లో ఏకంగా 95 శాతం మందిపై నేరారోపణలు ఉన్నాయి. దేశంలోనే ఇది అత్యధికం అని 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. కేరళ తర్వాత స్థానంలో తెలంగాణ (82 శాతం) నిలిచింది. ఆ తర్వాత ఒడిశా (76 శాతం) ఉంది. అత్యల్పంగా హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కో ఎంపీ మాత్రమే కేసులు ఎదుర్కొంటున్నారు. ఇక తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయానికి వస్తే.. పశ్చిమ బెంగాల్ (58 శాతం) మొదటి స్థానంలో ఉండగా, కేరళ (57 శాతం) రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ (56 శాతం), తెలంగాణ (49 శాతం), ఒడిశా (45 శాతం) తర్వాతి స్థానాలను ఆక్రమించాయని 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' నివేదించింది.

**ముఖ్యమంత్రులపై కేసులు..**

ఈ నివేదిక ప్రకారం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు ఉన్నట్లు తేలింది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన సువేందు అధికారి 29 పెండింగ్ కేసులతో తర్వాతి స్థానంలో ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఇద్దరూ చెరో 19 కేసులు ఎదుర్కొంటుండగా, కేరళకు చెందిన వీడీ సతీశన్ వద్ద 18 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో సిట్టింగ్, మాజీ శాసనసభ్యులపై ఉన్న ఈ కేసులను త్వరితగతిన విచారించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని అమికస్ క్యూరీ కోర్టును అభ్యర్థించారు. అలాగే, ఈ కేసుల విచారణ పురోగతిని ఆయా హైకోర్టులు స్వయంగా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు.

# దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

మొదటి పేజీ తరువాయి...

చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

మొదటి పేజీ తరువాయి...



అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్‌ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.



# మేయర్ ప్రత్యక్ష ఎన్నిక

మొదటి పేజీ తరువాయి...

నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని మరియు రిజర్వేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది.

**ప్రత్యక్ష పద్ధతిలో మేయర్లు, ఛైర్మన్ల ఎన్నిక...**

పాలనా సంస్కరణల్లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై మున్సిపాలిటీల ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్ల పదవులకు ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ తీర్మానించింది. అంటే.... ప్రజలే నేరుగా ఓటు వేసి తమ మున్సిపల్ ఛైర్మన్లను, కార్పొరేషన్ మేయర్లను ఎన్నుకుంటారు. ఈ నిర్ణయం ద్వారా స్థానిక సంస్థల్లో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సంఖ్య, పాలనా వ్యవస్థపై స్పష్టతనిస్తూ ఇకపై ప్రతి మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో ఒక్కరే డిప్యూటీ మేయర్ లేదా వైస్ ఛైర్మన్ ఉండేలా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నూతన విధానాలు రాబోయే అక్టోబర్ ఎన్నికల నుంచే అమలులోకి రానున్నాయి. మరోవైపు కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇక విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది.

# 4 మృతదేహాలు.. 9 పుర్రెలు..!

మొదటి పేజీ తరువాయి...

నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఆ మట్టిలో మానవ అస్థిపంజరాలు, పుర్రెలు కనిపించాయి. అది గమనించిన స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ మట్టిలో మృతదేహాలతో పాటు పూలదండలు, బట్టలు కూడా కనిపించడంతో ఏదైనా స్మశానం నుంచి ఈ మట్టిని తవ్వి తీసుకొచ్చి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా రాత్రివేళ ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ పడేసి వెళ్లారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఇంతకీ ఈ మృతదేహాలు నగరం నడిబొడ్డుకి ఎలా వచ్చాయి? అస్థిపంజరాలు, పుర్రెల వెనుక మిస్టరీ ఏంటి? అనేది తేల్చేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, తెల్లవారుజామున నడిరోడ్డుపై అస్థిపంజరాలు, మానవ పుర్రెలు కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అటుగా వెళ్లేందుకు కూడా ఎవరూ ధైర్యం చేయలేదు. అయితే, అవి స్మశానం నుంచి తవ్విన మట్టిలో వచ్చాయని తెలియడంతో స్థానికులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

మొదటి పేజీ తరువాయి...



నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# హైకోర్టులో మీడియేషన్ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**ఆర్బిట్రేషన్ సెంటర్ కూడా ఏర్పాటు**

**ఏవో పోస్టు భర్తీకి కేబినెట్ ఆమోదం**

**న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**అమరావతి, ఆగస్టు18 (జయ జయహే )**




రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం లో ఆమోద ముద్ర వేయడం జరిగిందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు. హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి ఫరూక్ తెలిపారు. రాష్ట్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, విస్తృత చర్యలు తీసుకోవడంలో భాగంగా పరిపాలనాపరంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి, సత్వర న్యాయానికి ప్రత్యేకంగా దృష్టి సారించి న్యాయ శాఖకు సంబంధించిన అన్ని విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశామన్నారు. న్యాయ సేవలను విస్తృతం చేయడం ద్వారా న్యాయ స్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# రైల్వే, జాతీయ రహదారి పనులను వేగవంతం చెయ్యాలి

**కలెక్టర్ వెంకటేశ్వర్**

**తిరుపతి, ఆగస్టు 18, జయ జయహే**



జిల్లాలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, భూసేకరణ, ఏపీఐఐసీ తదితర అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. శ్రీ సిటీ ఫేజ్-2, ఎల్‌జీ ఫేజ్-1, 2, 3, స్పేస్ సిటీ, నాయుడుపేట ఫేజ్-2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎన్‌ఫీల్డ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన కోర్టు కేసులు, వెబ్‌ల్యాండ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నడికుడి--శ్రీకాళహస్తి,ఏర్పేడు--పూడి,గుమ్మిడిపూండి--గూడూరు,గూడూరు--రేణిగుంట,పాకాల--తిరుపతి,తిరుపతి--కాట్పాడి, అరక్కోణం--రేణిగుంట రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. దుగ్గరాజపట్నం పోర్టు, వైజాగ్--చెన్నై కారిడార్ పైప్‌లైన్, ఏపీఐఐసీ ప్రాజెక్టులు, ఏడీబీ రోడ్ల పనులను కూడా వేగవంతం చేయాలనిఆదేశించారు. నాయుడుపేట--రేణిగుంట, రేణిగుంట--కడప,రేణిగుంట--చెన్నై మార్గాల్లో రహదారి నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సాగరమాల, జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో పెండింగ్ అంశాలను ఆర్డీఓలు, నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని తెలిపారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీ, జలవనరులు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ--5, ఏడీబీ రోడ్ల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇస్రేర్, కరకంబాడి, ఎంఐజీ లేఅవుట్, తిమ్మాజికండ్రిగ ప్రాంతాల్లో పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు వడమాలపేట, ఏర్పేడు మండలాల్లో టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల అంశాలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు, ఏపీఐఐసీ, ఏపీఎస్‌పీడీసీఎల్, రైల్వే, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ, భూసేకరణ శాఖల అధికారులు, తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

...

# గాలి నాణ్యత ఢిల్లీలో 195...విశాఖలో 205

**విశాఖ కన్నా హైదరాబాదే బెటర్**

**పోర్టు, ఫార్మా, రిఫైనరీ, ఫెర్టిలైజర్ పరిశ్రమల కారణంగానే దారుణం**

**కాలుష్యంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గంటా**

**విశాఖపట్నం, ఆగస్టు 18, జయ జయహే**



విశాఖ కాలుష్యం ఒక్కోసారి దేశ రాజధాని ఢిల్లీని మించిపోతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో గాలి నాణ్యత సూచిక 116, ఢిల్లీలో 195 ఉండగా.. విశాఖలో 205 గా ఉందని రీడింగ్ లు చూపించారు. విశాఖలో ఒక్క పోర్టు కాలుష్యం మాత్రమే కాకుండా ఫార్మా, రిఫైనరీలు, ఫెర్టిలైజర్స్ వంటి అనేక పరిశ్రమలున్నాయని, వాహన కాలుష్యం కూడా ఉందన్నారు. బొగ్గు, ఇనుప ఖనిజాల ఎక్కువ కాలుష్యం వెదజల్లడాన్ని దృష్టిలో ఉంచుకుని చెన్నై పోర్టుకు సమీపంలో ఎన్నూర్ పోర్టు అభివృద్ధి చేసిన మాదిరిగా శ్రీకాకుళం జిల్లా మూలపేటకు అలాంటి వాటి కార్యకలాపాలను తరలించాలని సూచించారు. తెల్లచొక్కాతో విశాఖ వన్ టౌన్ ప్రాంతానికి వెళ్లి చొక్కా రంగు మారకుండా రాలేరని తన మిత్రులైన కొందరు వాకర్లు తనతో చెప్పిన విషయాన్ని గంటా ప్రస్తావించారు. యూరోపియన్ దేశాల మాదిరిగా కాలుష్య కారక పరిశ్రమలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశ్రమ స్థాపనకయ్యే వ్యయంలో 10 శాతం గ్రీన్ కవర్ కోసం వెచ్చించాలనే కఠిన నిబంధన విధించాలని పేర్కొన్నారు. పాతికేళ్ల క్రితం అవసరాలకు తగ్గట్టు నియమించిన ఉద్యోగులే కాలుష్య నియంత్రణ మండలిలో ఉన్నారని.. సిబ్బందిని పెంచి ఆ శాఖను మరింత పటిష్టం చేయాలని చెప్పారు. పరిశ్రమలు ఎస్.టి.పి.లు, ఈ.టి.ఎఫ్.లు వంటి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. గూగుల్ సహా అనేక ఐటీ కంపెనీలు, టూరిజం ప్రాజెక్టులు, ఫైవ్ స్టార్ హోటల్స్, రిసార్ట్స్ విశాఖ వస్తున్నాయని, కాలుష్యం విషయంలో భయపడే స్థితి రాకుండా చూడాలని కోరారు. ఏపీ గ్రీన్ చైర్మన్ గా నియమితులైన కె.నాగబాబు కాలుష్య నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలని, కాలుష్య కట్టడిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

**ఎయిర్ పోర్టు ప్రైవేట్ సిబ్బందికి ప్రత్యామ్నాయం చూడాలి..!**

ఎయిర్ పోర్టు భోగాపురం తరలిపోయిన నేపథ్యంలో విశాఖ ఎయిర్ పోర్టులో పని చేసిన ప్రైవేట్ సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో కోరారు. రెస్టారెంట్లు, కేటరింగ్, క్లీనింగ్ తదితర విభాగాల్లో 1,450 మంది పనిచేస్తున్నారని, ఎన్ని ఏళ్లుగా విశాఖ ఎయిర్ పోర్టుతో అనుబంధం ఉన్న వారిలో చాలామందికి ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు కాకుండా 65 టాక్సీలపై ఆధారపడిన 100 మంది జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఎన్నో ఏళ్లుగా విశాఖ ప్రజలతో పెన వేసుకున్న ఎయిర్ పోర్టు బంధం ఈనెల 16 తో తెగిపోయిందని భావోద్వేగం చెందారు.

# ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు దుర్మరణం



**తిరుపతి ఆగస్టు 18 ( జయ జయహే)**

బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని శ్రీకాళహస్తి--తడ ప్రధాన రహదారి పై 10వ మైలు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టెంపో ట్రావెలర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. శ్రీ సిటీలోని ఎల్‌జీ కంపెనీ ఉద్యోగులను తీసుకువెళ్లేందుకు జేజే ట్రావెల్స్‌కు చెందిన టెంపో ట్రావెలర్ శ్రీకాళహస్తి నుంచి బయలుదేరింది. వాహనం 10వ మైలు సమీపానికి చేరుకోగానే, టెంపో ట్రావెలర్ ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ ను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న గోపాల్ (60, తండ్రి: కృష్ణారెడ్డి, గ్రామం: బూడిదమడుగు, సూళ్లూరుపేట మండలం) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న డి. గురవారెడ్డి



(45, తండ్రి: లేట్ డి. సుబ్బయ్య, గ్రామం: సుబ్బయ్యగుంట, రేణిగుంట మండలం)ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**అంత్యక్రియలకు వెళ్తుండగా విషాదం**

బాధితులు ఇద్దరూ మంగళవారం ఉదయం బూడిదమడుగు నుంచి బయలుదేరి రేణిగుంట మండలం సుబ్బయ్యగుంట గ్రామంలో జరిగే ఒక అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని బంధువులు రోదిస్తూ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# మొబైల్ చోరీ కేసును ఛేదించిన తిరుపతి పోలీసులు

**రూ.1.50 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు, ట్యాబ్ లు స్వాధీనం**

**తిరుపతి,ఆగస్టు 18,జయ జయహే.**



తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనో విజన్ మొబైల్ షోరూమ్‌లో సినీఫక్కీలో జరిగిన భారీ చోరీ కేసును జిల్లా పోలీసులు కేవలం ఆరు రోజుల్లో ఛేదించారు. బంగ్లాదేశ్‌కు చోరీ సొత్తును తరలించేందుకు ప్రయత్నిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసి, సుమారు రూ.1.50 కోట్ల విలువైన 195 మొబైల్ ఫోన్లు, 5 ఆపిల్ ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 8న షోరూమ్ గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు భారీగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను అపహరించారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. జార్ఖండ్, నాగ్‌పూర్, పశ్చిమ బెంగాల్‌కు బృందాలను పంపి, ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయంతో దర్యాప్తు చేపట్టారు. చోరీ సొత్తుతో బంగ్లాదేశ్ సరిహద్దు వైపు వెళ్తున్న నిందితులను పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 175 మొబైల్ ఫోన్లు, 5 ఆపిల్ ట్యాబ్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారి సమాచారంతో తిరుపతిలో మరో నిందితుడిని అరెస్ట్ చేసి 20 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన ఈ ముఠా దేశంలోని పలు ప్రాంతాల్లో పెద్ద మొబైల్ షోరూమ్‌లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు ఆలమ్ షేక్‌పై పలు రాష్ట్రాల్లో సుమారు 12 కేసులు ఉన్నట్లు వెల్లడైంది. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. పెద్ద వ్యాపార సంస్థలు, దుకాణాల యజమానులు అధునాతన అలార్మింగ్ సిస్టమ్స్, మోషన్ డిటెక్షన్ కెమెరాలు, ప్రైవేట్ సెక్యూరిటీ వంటి భద్రతా చర్యలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# హంద్రీనీవా సుజల స్రవంతి పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతి

**రాయచోటి, అన్నమయ్య జిల్లా ప్రజల తాగు, సాగు అవసరాలకు ప్రాధాన్యత.. సీఎం చంద్రబాబు చొరవపై మంత్రి మండిపల్లి హర్షం**

**అమరావతి, ఆగస్టు 18, జయ జయహే**



హంద్రీ-నీవా సుజల స్రవంతి ఫేజ్- 2లో భాగంగా మిగిలిన మెయిన్ కెనాల్, సీసీ లైనింగ్, నీవా బ్రాంచ్ కెనాల్ తదితర పనులను పూర్తి చేసేందుకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. మెయిన్ కెనాల్‌ను తొలుత లైనింగ్ లేకుండా నిర్మించడంతో డిజైన్ చేసిన 2,520 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు ఇబ్బందులు ఉన్నాయని, అందువల్ల మిగిలిన కాలువ పనులతో పాటు సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలో హంద్రీనీవా మెయిన్ కెనాల్ కిమీ 490 నుంచి 535 వరకు సుమారు 45 కి.మీ. మేర పనులు ఉన్నాయి. ఈ పనులకు సుమారు రూ.290 కోట్లు, అదనంగా రూ.60 కోట్లతో కలిపి మొత్తం సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కిమీ 463 నుంచి 554 వరకు హంద్రీనీవా మెయిన్ కెనాల్ పనులను ఒకే సింగిల్ ప్యాకేజీగా చేపట్టే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మన నియోజకవర్గ పరిధిలోని 490--535 కి.మీ. పనులు కూడా ఈ సమగ్ర ప్యాకేజీలో భాగం కానున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో పనిచేసి, కేవీ పల్లి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, రాయచోటి, పీలేరు, చిత్తూరు ప్రాంతాలకు తాగునీరు అందించడంతో పాటు సాగునీటి అవసరాలను తీర్చేందుకు మరింత ఉపయోగపడుతుందని, 25 వేల ఎకరాల ఖాళీ చెరువులు నింపి ప్రజలకు నీటి భరోసా కల్పిస్తాం మంత్రి అన్నారు. హంద్రీనీవా కెనాల్ ద్వారా శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని ఖాళీ చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంలో ఎచ్చీూ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజల చిరకాల నీటి అవసరాలను గుర్తించి ముఖ్యమంత్రి చొరవ, దూరదృష్టితో ఈ ప్రాంతానికి తాగునీరు, సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు సాధ్యమైనంత త్వరగా నీటి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.



# నిర్వాసితుల రెండో లిస్టు ప్రకటించాలి

**నక్కపల్లి (జయ జయహే)**


ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులలో అర్హత కలిగిన వారికీ ప్యాకేజీ ఇవ్వాలి, నిర్వాసితులు చేసిన ఆందోళనలో భాగంగా ప్రభుత్వం రెండో విడత లిస్టు ప్రవేశపెట్టి ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు హామీలు ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ ప్యాకేజీ ఇవ్వకుండా నిర్వాసితులకు తీవ్రమైన మోసం చేస్తున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలు మేరకు రెండో విడత ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు అదే విధంగా వివాహం అయిన ఆడ పిల్లలకు ప్యాకేజీ ఇస్తామని వివిధ సందర్భాలలో అధికారులు హామీలు ఇచ్చారు కానీ హామీలు అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము.ప్రతీ నిర్వాసిత కుటుంబానికి ఆర్ కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ పనులలో నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పనులు కల్పించాలని కోరారు ప్రస్తుతం నిర్వాసితులు ఇళ్ళు నిర్మించుకుంటున్న కారణంగా ఉపాధి లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు, ఇటువంటి సమయంలో ప్రభుత్వం నిర్వాసితులకు జీవన బ్రృతి కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలు మేరకు ఇసుక, సిమెంట్, ఐరన్ సబ్సిడీ మీద ఇవ్వాలి,ప్రతీ ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా మంచి నీరు సౌకర్యం కల్పించాలి, ఉచితంగా గ్రావెల్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్,యు.దుర్గ, ఎం.అప్పారావు, ఎస్.అమ్మాజీ, ఎస్.వరాలమ్మ, ఎస్.నానాజీ, ఎస్.లలిత,యు.లక్ష్మి, ఎం.లోవమ్మ,టి.కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులకు బాడీ కెమెరాలు అందజేసిన ఫార్మా కంపెనీ

**అనకాపల్లి జయ జయహే**

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ కు పరవాడ ఈఐఎస్ఎఐ ఫార్మ సూటికల్స్ సంస్థ 25 బాడీ వార్న్ కెమెరాలను సి ఎస్ ఆర్ నిధుల ద్వారా విరాళంగా అందజేయడం జరిగింది జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఈ కెమెరాలను ప్రారంభించి వారి సిబ్బందికి బాడీ కెమెరాలు అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ విధి నిర్వహణకు ఆధునిక సాంకేతిక కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సహకారం అందించిన ఫార్మా ప్రతినిధులు గిరీష్ దీక్షిత్ ఆనంద్ గాల్పడే మదన్ మోహన్ లకు పోలీసులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## సముద్రగర్భ వనరుల
# సమర్థ వినియోగం

(సీ హెచ్ . ప్రతాప్)

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సముద్రంతో అనుసంధానించాలంటే ఇక ఓడరేవులు, చేపల వేట, సముద్ర వాణిజ్యం అనే సంప్రదాయ ఆలోచనలకే పరిమితం కాకూడదు. సముద్రాన్ని విశాలమైన సహజ ప్రయోగశాలగా చూడాల్సిన సమయం వచ్చింది. సముద్ర ఉపరితలంపై కనిపించేది కొంత మాత్రమే; దాని అడుగున ఉన్న భౌగోళిక వనరులు, జీవవైవిధ్యం, ఔషధ విలువలు, వాతావరణ సమాచారం, శక్తి అవకాశాలు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు కొత్త దిశ చూపగలవు.

ఆంధ్రప్రదేశ్‌కు 1,053.07 కిలోమీటర్ల తీరరేఖ ఉంది. విశాఖపట్నంలో ఒక ప్రధాన ఓడరేవుతో పాటు 15 ఇతర ఓడరేవులు రాష్ట్రానికి ఉన్నాయి. ఈ భౌగోళిక బలం ఇప్పటివరకు ప్రధానంగా సరకు రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకే ఉపయోగపడుతోంది. కానీ అదే తీరాన్ని సముద్ర విజ్ఞానానికి మౌలిక వేదికగా మార్చగలిగితే రాష్ట్రానికి మరో ఆర్థిక ద్వారం తెరుచుకుంటుంది.

ఇప్పటికే సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఎంత విలువైనదో గణాంకాలే చెబుతున్నాయి. 2024--25లో ఆంధ్రప్రదేశ్ 3,66,182 టన్నుల సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసి రూ.21,245.90 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో పరిమాణపరంగా సుమారు 21.6 శాతం, విలువపరంగా 34 శాతానికి పైగా రాష్ట్రం వాటా కలిగి ఉంది. ఇది కేవలం మత్స్యరంగం విజయం కాదు; సముద్రాన్ని ఆధారంగా చేసుకుని భారీ విలువను సృష్టించగల సామర్థ్యానికి నిదర్శనం.

మరో ముఖ్యమైన అవకాశం తీర ఇసుకలోనే కనిపిస్తోంది. 2025 డిసెంబరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 25 నిక్షేప ప్రాంతాల్లో మొత్తం 359.79 మిలియన్ టన్నుల భారీ ఖనిజ వనరులు గుర్తించబడ్డాయి. ఇందులో ఇల్మెనైట్ 178.75, రూటైల్ 11.46, మోనజైట్ 4.05, జిర్కాన్ 12.75, గార్నెట్ 67.30, సిల్లిమనైట్ 81.85 మిలియన్ టన్నులు ఉన్నాయి. ముఖ్యంగా మోనజైట్‌లో అరుదైన భూఖనిజాలకు సంబంధించిన అవకాశాలు ఉండటం భవిష్యత్తు సాంకేతిక పరిశ్రమలకు ప్రాధాన్యాన్ని పెంచుతుంది.

అందువల్ల రాష్ట్రం "ఆంధ్ర సముద్ర విజ్ఞాన మిషన్"ను ఏర్పాటు చేయాలి. విశాఖపట్నాన్ని కేంద్రంగా చేసుకుని సముద్రగర్భ పటాల తయారీ, జీవవైవిధ్య పరిశోధన, సముద్ర ఔషధాల అన్వేషణ, సముద్ర కాలుష్య పర్యవేక్షణ, మత్స్య వనరుల శాస్త్రీయ అంచనా, తీర విపత్తుల ముందస్తు హెచ్చరిక వంటి రంగాల్లో విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలను అనుసంధానించాలి.

ఆంధ్రకు సముద్రం ఒక సరిహద్దు కాదు.. భవిష్యత్తుకు విస్తరించిన ప్రయోగశాల. అలలను మాత్రమే లెక్కించే దశ నుంచి సముద్రాన్ని అర్థం చేసుకునే దశకు రాష్ట్రం అడుగుపెడితే, రేపటి ఆంధ్ర ఆర్థిక శక్తి తీరంలోనే కాదు.. సముద్రపు లోతుల్లోనూ నిర్మితమవుతుంది.

# కాలాన్ని పట్టి ఆపేది ఒక్క ఫోటో మాత్రమే సుమా

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక శీర్షిక

**మధుర క్షణాలను మధురాతి మధుర భావనలను మదిలో పదిలపరిచే యంత్రమే ఛాయాగ్రాహకం ( కెమెరా ).**

**జ్ఞాపకాలు అన్ని మనసులో ఉండటమే చిత్రం ఒక జీవితకాలం కాకుండా జీవిత ప్రయాణం అయిపోయిన ఫోటో మాత్రం చెక్కుచెదరకుండా గుండెల్లో పదిలము. మన కళ్ళతో చూసే ప్రతి అందాన్ని శాశ్వతంగా బంధించడమే ఫోటోగ్రఫీ.**



ఒక ఫోటో మన మనసులో మెదిలే సహస్ర భావాల మాటల జవాబు. 1826 జోసెఫ్ ఫోర్ నిప్స్ మొట్టమొదటిసారిగా ఒక శాశ్వతమైన ఫోటోను విజయవంతంగా క్యాప్చర్ చేశారు. ఈ సమయంలో ఒక ఫోటో బయటకి రావాలి అంటే మొదటిసారిగా ఆప్స్క్యూరా సహాయంతో పది గంటల నుంచి ఒకరోజు సమయం పట్టేది డాగ్యూరే అన్నయ్య ఫ్రెండ్స్ వ్యక్తి 1839లో ఫోటోను ఆగస్టు 19వ తేదీన డాగ్యూరోటైప్ అనే అత్యాధునిక విధానంతో కొన్ని నిమిషాల సమయంలో వచ్చేలా కొత్త పద్ధతిని కనుగొన్నారు. అందుకే చరిత్రలో ఆగస్టు 19 ఫోటోగ్రఫీకి ఎంత ప్రాముఖ్యమైన రోజు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకునే రోజు. 1888లో రోల్ ఫిలిం కెమెరాతో సాధారణ ప్రజలకు కూడా ఫోటోగ్రఫీ అందుబాటులోకి వచ్చింది. 1840లో బ్రిటిష్ కాలంలో భారత దేశంలో ఫోటోగ్రఫీ చాలా విస్తారంగా పెరిగింది. అప్పుడే 1854లో బాంబే ఫోటోగ్రఫీ సొసైటీ ఏర్పడింది.

కాలాన్ని పట్టి ఆపగలిగే శక్తి ఒక్క ఫోటో కే సుమా..!!మానవ జీవితం చాలా వేగవంతంగా మారుతూ ఉంటుంది కానీ ఆ మార్పులను ఆనందాలను శాశ్వతంగా నిలిపేది ఒక ఫోటో మాత్రమే. మానవ జీవితం క్షణకాలం..ఫోటో మాత్రమే శాశ్వతం. ప్రకృతిలో ఉన్న అందాలను పర్యావరణంలో ఉన్న కొన్ని కొన్ని సహజ సిద్ధ అందాలనే కాకుండా పసిడి కాంతులను పసి నవ్వులను కూడా అద్భుతంగా చూపించేది ఫోటో. బావోద్వేగాలు అనురాగ ప్రేమ ఆనంద అనుభూతులను ఎంతో కడు రమ్యంగా భద్రపరచి అందరి మధ్యలో చిరస్థాయి ముద్ర వేసుకొని ఉన్న ఈ ఫోటో అనే పదం వినగానే అందరి హృదయాల్లో ఉల్లాసం ఏర్పడుతుంది. పండు వెన్నెలను, వృద్ధుల బోసి నవ్వులను పచ్చని పైరుని ఎంతో ఆహ్లాదంగా చూపించగల విశేష పరికరం కెమెరా. కానీ ప్రస్తుతం సమాజంలో ప్రతి భావాన్ని అరచేతిలో పట్టి బంధించేలా చరవాణి లు ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. ప్రజలు చరవాణి కొనుగోలు చేసే సమయంలో అధిక ప్రాధాన్యం ఫోటోలు కోసం ఆలోచన చేసి మంచి కెమెరా ఫ్యూచర్లు ఉన్న చరవాణీలను కొనుగోలు చేయుటకు మొగ్గు చూపుతున్నారు. రక్తసంబంధం భూమిలో కలిసిపోయిన స్నేహబంధం కాలగమనంలో కరిగిపోయిన మనిషి యొక్క జీవితకాలం గడిచిపోయిన అందరి నయనారవిందం లో చిరస్మరణీయంగా మిగిలేది ఫోటో మాత్రమే.

యువతపై ప్రభావం చూపే ఫోటోగ్రఫీ కోర్సులు :- యువతలో విభిన్న ఆలోచనలు చక్కని నిర్ణయాలతో పాటుగా మంచి వృత్తి విద్యా కోర్సులను చేయాలని నిర్ణయించుకుని అందులో అతి ముఖ్యమైన ఫోటోగ్రఫీ కోర్సులను ఎక్కువగా చేస్తున్నారు. తల్లి ప్రేమను సోదర భావాన్ని చెలి స్నేహాన్ని భార్యాభర్తల అనురాగాన్ని సన్నివేశం ఏదైనా సందర్భం ఏదైనా ఫోటోలను బంధించాలి అంటే ఫోటోగ్రఫీ లో నిష్ణాతులను ఎంపిక చేసుకొని వివిధ రకాలైన శుభకార్యాలకు ఫోటోగ్రాఫర్లను నియమించుకుంటున్నారు. ఈ విధానంలో యువత ఫోటోగ్రఫీ కోసం చేయడానికి ఎక్కువ మక్కువ చూపి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనితో అందాలను బంధాలను రెట్టింపు చేయాలి అనే ఉద్దేశంతో స్త్రీ పురుష భేదం లేకుండా ప్రపంచంలో నేర్చుకునే వారి సంఖ్య అధిక శాతం నమోదు అవుతున్నది.

**క్షణాల్లో జీవిని విగతి జీవిగా మార్చే సెల్ఫీలతో**


**జరభద్రం సుమా..:-**

1. బైక్ నడుపుతూ సెల్ఫీ దిగాలి అనే ప్రయత్నంలో చిన్న తప్పిదాకు ప్రాణాలు విడుస్తున్నారు.
2. బీచ్ లకు సరదాగా వెళ్లి సెల్ఫీల వ్యామోహంతో జీవితాన్ని బలి చేసుకుంటున్నారు.
3. వేగంగా వెళ్లే రైలు ప్రయాణంలో సెల్ఫీలు దిగడం కోసం ఆరాటపడుతూ ఆలోచనలో పడి విగత జీవితగా క్షణాల్లో మారుతున్నారు.
4. ఆలోచన రహితంగా ఫోటోలు దిగి జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారు.
5. ఆనందం కోసం తీసుకునే ఫోటోలు ప్రాణాలను అంత చేసుకోవడానికా అన్నట్లుగా కొన్ని కొన్ని సార్లు ఫోటోలు మోజులో పడి జీవితంలో స్నేహితులని ప్రాణాతి ప్రాణంగా భావించే కుటుంబ సభ్యులను దూరం చేసుకుంటున్నారు.

అన్నిటికన్నా ప్రాణాలు మిన్న అనే ఆలోచన చేస్తూ జాగురతతో ఫోటో లు తీసుకునే....

ఫోటోగ్రఫీ ప్రేమికులందరికీ

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తో.....



రచన...
ఏ. బాల సౌజన్య కుమారి
తెలుగు ఆచార్యులు

# క్షుద్ర రాజకీయాలు దేనికి సంకేతం?



వర్షాలకు పూజల ముడి.. రాజకీయాలకు మూఢనమ్మకాల రంగు!

అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన వాళ్లే అందవిశ్వాసాలకు ఆద్యం పోస్తే సమాజానికి ఏం సందేశం?

ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఉండాలి. ప్రజల సమస్యలపై చర్చ జరగాలి. పాలకులు విధానాలు వివరించాలి. ప్రతిపక్షాలు వైఫల్యాలు ఎత్తిచూపి ప్రత్యామ్నాయాలు సూచించాలి. ఇదే ఆరోగ్యకర ప్రజాస్వామ్యం.

కానీ రాజకీయ చర్చల స్థాయి ప్రజా సమస్యల నుంచి వ్యక్తిగత ఆరోపణలు, మూఢనమ్మకాలు, క్షుద్రపూజల ఆరోపణల దిశగా మళ్లితే సమాజం ఆలోచించాల్సిన పరిస్థితి.

తెలంగాణలో మాజీ మంత్రి హరీశ్‌రావు వర్షాలు పడకుండా ఉండాలని క్షుద్రపూజలు చేయించారంటూ కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి. హరీశ్‌రావు వర్గం వీటిని ఖండిస్తూ చట్టపరమైన చర్యలకు దిగింది.

ఈ ఆరోపణల్లో నిజానిజాలు ఆధారాలతో తేలాలి. కానీ అంతకంటే కీలకమైన ప్రశ్న ఇది:

ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన నాయకులు.. ప్రకృతి పరిణామాలను మూఢనమ్మకాలతో ముడిపెట్టి రాజకీయ అస్త్రాలుగా ఉపయోగించడం సమాజానికి ఏం సందేశం ఇస్తుంది?

**వర్షానికి రాజకీయ రంగు ఎందుకు?**

వర్షం ఒక సహజ ప్రకృతి ప్రక్రియ. వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రతలు, గాలుల కదలికలు, పీడన పరిస్థితులు, సముద్ర ప్రభావాలు వర్షపాతాన్ని నిర్ణయిస్తాయి.

వర్షాలు తగ్గితే రైతులు ఆందోళన చెందుతారు. జలాశయాల పరిస్థితిని సమీక్షించాలి. ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టాలి.

**అలాంటి సమయంలో చర్చ జరగాల్సింది:**

ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎన్ని ఎకరాలకు సాగునీరు? వర్షాభావాన్ని ఎలా ఎదుర్కోవాలి? రైతులకు ఏ పంటల సలహా? వాతావరణ హెచ్చరికలను గ్రామస్థాయికి ఎలా తీసుకెళ్లాలి?

కానీ వాటికి బదులు 'ఎవరు పూజలు చేశారు?' అనే చర్చ మొదలైతే ప్రజా సమస్య పక్కదారి పట్టినట్లే.

వర్షం కోసం రైతు ఆకాశం వైపు చూస్తుంటే.. రాజకీయాలు ఒకరిపై ఒకరు వేలెత్తి చూపడంలో ఉంటే ప్రయోజనం ఎవరికి?

**ఆరోపణకు ఆధారం ఉండాలి**

రాజకీయాల్లో విమర్శలు సహజం. ప్రత్యర్థుల విధానాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ ప్రతి ఆరోపణకు ఆధారం ఉండాలి.

అవినీతి అంటే ఆధారాలు చూపాలి. ప్రభుత్వం విఫలమైందంటే గణాంకాలు చెప్పాలి.

అదేవిధంగా క్షుద్రపూజలు చేశారనే ఆరోపణ చేస్తే కూడా దానికి ఆధారాలు ఉండాలి.

ఆధారం లేని ఆరోపణ రాజకీయ విమర్శగా మొదలై.. ప్రజల్లో అపోహలకు విత్తనంగా మారుతుంది. ఇలాంటివి ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపలేవు.

**నేతల మాటలకు విలువ ఎక్కువ ఉంటుంది**

సాధారణ వ్యక్తి మూఢనమ్మకాన్ని నమ్మడం వేరు. ప్రజలను ప్రభావితం చేసే నాయకుడు బహిరంగంగా చెప్పడం వేరు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రకృతి, వర్షాలు, పంటలపై ఇప్పటికే అనేక అపోహలు ఉన్నాయి. రైతులకు శాస్త్రీయ వ్యవసాయం నేర్పాల్సిన నాయకులు.. వాతావరణ సమాచారం తీసుకెళ్లాల్సిన ప్రభుత్వాలు.. మూఢనమ్మకాల చర్చకు ప్రాధాన్యం ఇస్తే పరిస్థితి ఏమిటి?

**నాయకులు ప్రజలను చైతన్యపరచాలా? లేక భయాలు, అపోహలకు రాజకీయ రంగు పులమాలా?**

ఈ ప్రశ్నకు సమాధానం అధికార పక్షానికే కాదు.. ప్రతిపక్షానికీ ఉంది.

వ్యక్తిగత విశ్వాసం వేరు.. రాజకీయ ప్రచారం వేరు

ఎవరైనా వ్యక్తిగతంగా పూజలు చేయడం, ఆలయాలకు వెళ్లడం వారి స్వేచ్ఛ. దాన్ని గౌరవించాలి.

కానీ ఒక వ్యక్తి వ్యక్తిగత విశ్వాసాన్ని ప్రకృతి పరిణామాలకు కారణంగా చూపడం.. దానిని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం వేరు.

భక్తి వ్యక్తిగతం.. పాలన ప్రజలది.

**విశ్వాసం వ్యక్తిగతం.. విధానం శాస్త్రీయం కావాలి.**

రైతుకు కావాల్సింది పూజల ఆరోపణలు కాదు

తెలంగాణలో రైతు వర్షం కోసం ఎదురుచూస్తాడు. పంట వేసిన తర్వాత నీటి కోసం ఆందోళన చెందుతాడు. తెగుళ్లు, ఎరువులు, కూలీల కొరత, మార్కెట్ సమస్యలను ఎదుర్కొంటాడు.

అతని సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వాలది.

రైతుకు కావాల్సింది క్షుద్రపూజల కథలు కాదు.. పంటకు శాస్త్రీయ సలహాలు.

వర్షాలు తగ్గితే ప్రత్యామ్నాయ పంటల సూచనలు కావాలి. నీటి కొరత ఉంటే సూక్ష్మ నీటిపారుదలను ప్రోత్సహించాలి. పంట నష్టపోతే నష్టపరిహారం అందాలి. ధర పడిపోతే మార్కెట్ మద్దతు కల్పించాలి.

రైతు జీవితాన్ని మార్చేది రాజకీయ ఆరోపణలు కాదు.. ఆచరణాత్మక విధానాలు.

**ఇది రాజకీయ పార్టీల సమస్య మాత్రమే కాదు**

ఈ అంశాన్ని ఒక పార్టీకి పరిమితం చేయడం సరైంది కాదు. అధికారంలో ఉన్నవారైనా.. ప్రతిపక్షంలో ఉన్నవారైనా ఒకే ప్రమాణం పాటించాలి.

ప్రత్యర్థిని విమర్శించండి.. కానీ ఆధారాలతో.

ప్రభుత్వాన్ని ప్రశ్నించండి.. కానీ గణాంకాలతో.

విధానాలను వ్యతిరేకించండి.. కానీ ప్రత్యామ్నాయాలతో.

ఈ రోజు ఒక పార్టీ మూఢనమ్మకపు ఆరోపణ చేస్తే.. రేపు అదే ఆయుధం మరో పార్టీ చేతిలోకి వెళ్తుంది. చివరికి దెబ్బతినేది ఒక నాయకుడు కాదు.. రాజకీయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం.

**రాజకీయాలకు కొత్త ప్రమాణాలు అవసరం**

నాయకుడి స్థాయిని అతను ఎంత ఘాటుగా ప్రత్యర్థిని విమర్శించాడనే దానితో కొలవకూడదు.

ఎన్ని సమస్యలకు పరిష్కారాలు చూపాడు?

ఎన్ని కుటుంబాలకు భరోసా ఇచ్చాడు?

ఎంత శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించాడు?

ఇవే నాయకత్వానికి అసలు కొలమానాలు.

ప్రజలను భయపెట్టే నాయకత్వం కాదు.. ప్రజలను ఆలోచింపజేసే నాయకత్వం కావాలి.

**ప్రశ్నించాల్సింది ప్రత్యర్థిని కాదు.. సమస్యను**

వర్షాలు రాకపోతే వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేయాలి. పంటలు ఎండిపోతే నీటి నిర్వహణను సమీక్షించాలి. రైతు నష్టపోతే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలి.

సమస్యకు కారణం వెతకాలి.. రాజకీయ ప్రత్యర్థిని కాదు. ఇదే ప్రజాస్వామ్య స్ఫూర్తి.

**చివరికి ప్రశ్న మనందరిదీ:**

మన రాజకీయాలు ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాయా?

లేక భయాలు, అపోహలు, మూఢనమ్మకాలకు బలం చేకూరుస్తున్నాయా?

వర్షం ప్రకృతి ప్రసాదం.. రాజకీయ ఆయుధం కాదు.

ప్రజాస్వామ్యం ప్రజల సమస్యలకు వేదిక.. మూఢనమ్మకాల ప్రచార వేదిక కాదు.

రాజకీయాలు మారాలి. చర్చల స్థాయి పెరగాలి. ఆరోపణలకు ఆధారాలు రావాలి.

క్షుద్ర రాజకీయాలకు ముగింపు పలికి.. శాస్త్రీయ ఆలోచనకు పట్టం కట్టినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.



జి. అజయ్ కుమార్

# ప్రారంభమైన పాఠశాల.. గ్రామ ప్రజల హర్షం





**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 18**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గింజర్తి గ్రామ ప్రజల సుదీర్ఘ పోరాటం ఫలించింది. గ్రామంలో మూతపడిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించారు. 2025 సంవత్సరంలో విద్యాశాఖ నూతన మార్గదర్శకాల ప్రకారం చింతలపూడి పాఠశాలను మోడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో, గింజర్తి పాఠశాలలోని 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను చింతలపూడి పాఠశాలలో విలీనం చేశారు. దీంతో గింజర్తి గ్రామ ప్రజలు తమ పిల్లల విద్య, భవిష్యత్తు మరియు రాకపోకల్లో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలని కోరారు. సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఎస్పి, జిల్లా కలెక్టర్ , ఎంఈఓ మరియు సంబంధిత అధికారులు పిల్లల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రభుత్వం నుండి గింజర్తి గ్రామంలో పాఠశాలను కొనసాగించేందుకు ఆదేశాలు రావడంతో పాఠశాలను తిరిగి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా గింజర్తి గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కొయ్యూరు సీఐ తో పాటు మండల స్థాయి అధికారులు, ఎంఈఓ, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, "పిల్లల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని" సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అధికారులు పాల్గొన్నారు.



## మత్తుకు దూరంగా.. బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

**ఎస్పై విజయ్ కుమార్**

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 18:**

ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవరెడ్డి పాఠశాలలో సౌత్ జోన్ ఈగల్ బృందం ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంనిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పై విజయ్ కుమార్ మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, అపరిచితుల నుంచి చాక్లెట్లు, డ్రింక్స్, ఈ-సిగరెట్లు లేదా ఇతర వస్తువులు స్వీకరించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మరాదని, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు,ఓటిపి లు పంచుకోవద్దన్నారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్--112కు సమాచారం అందించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, పోలీస్ కానిస్టేబుళ్లు రామ్ కుమార్, చిన్నశ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పూతలపట్టు వారపు సంతలో ట్రాఫిక్ నియంత్రణ

**పూతలపట్టు, ఆగస్టు,18, జయ జయహే.**

పూతలపట్టులో మంగళవారం జరిగిన వారపు సంతలో పూతలపట్టు సీఐ తిమ్మయ్య ట్రాఫిక్ ను నియంత్రణ చేపట్టారు. వారపు సంతలో వ్యాపారస్తులు చుట్టుపక్కల ప్రజలు వేలాదిమంది సంతకు వస్తూ ఉంటారు . దీంతో ప్రజలు వ్యాపారం చేసుకుంటూ గుంపులు గుంపులుగా ఉంటారు ఇదే అదనంగా భావించే కొంతమంది ఆకతాయి యువకులు సంతకు వచ్చే ప్రజలు వ్యాపారస్తుల దగ్గర సెల్ ఫోన్లు దొంగతనాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీఐ తెలిపారు. అందుకు ప్రత్యేక సిబ్బంది ని ఏర్పాటు చేశామని తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను రోడ్డుకు దూరంగా పెట్టించారు. త్రిబుల్ రైడింగ్ వెళుతున్న పలు వాహనదారులను పట్టుకొని వారికి జరిమానా విధించారు.



## నిడదవోలులో ఇంటింటికీ రెండేళ్ల నమ్మకం.. కార్యక్రమం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన నాలుగో వార్డ్ ఇంచార్జ్ శిల బోయిన వెంకటరమణ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను 4 5 6 వార్డుల ప్రజలకు వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోందన్నారు. డీఎస్సీ నిర్వహించి 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తూ, పిల్లల విద్యకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని శేషారావు తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల పొగాకు రైతులు నష్టపోయారని విమర్శించిన ఆయన, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించే స్త్రీ శక్తి పథకంపై మహిళలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.




## మా సమస్యలు మేమే చూసుకుంటాం.. మధ్యలో మార్గాని భరత్‌కు ఎందుకు?

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 18**

వైశ్య సంఘాలు రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, వాటిలో రాజకీయ జోక్యం తగదని వైశ్య సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. వైఎంవిఏ హాలులో నిర్మిస్తున్న లిఫ్ట్‌కు ప్రభుత్వ నిధులు గానీ, విరాళాలు గానీ తీసుకోలేదని, వైశ్యుల సహకారంతో సొంత నిధులతోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. లిఫ్ట్ నిర్మాణాన్ని కొందరు అడ్డుకోవడం బాధాకరమని, వృద్ధులు, ప్రజల సౌకర్యం కోసమే ఈ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. స్థలానికి సంబంధించిన వివాదాన్ని మున్సిపల్ కార్పొరేషన్ తేల్చాలని, అవసరమైతే చెల్లింపులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో మాజీ ఎంపి మార్గాని భరత్ జోక్యం ఎందుకని ప్రశ్నిస్తూ, వైశ్య సంఘాలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేయవద్దని కోరారు. సేవా సంస్థలపై రాజకీయ నీడలు పడకుండా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కోట్ల కనకేశ్వరరావు, మద్దుల మురళీకృష్ణ, పందిరివీరభద్రస్వామి, ఇన్నమూరి శ్రీరామచంద్రమూర్తి, ఇన్నమూరి దీపు, పెంటపాటి సుభాష్, కక్కిరాల బుచ్చిరాజు, పులవర్తి లక్ష్మణస్వామి, మైలవరపు నాగేంద్ర ప్రసాద్, ప్రభాత్ పాల్గొన్నారు.



## విశాఖపట్నంలో బీజేపీ జాతీయ అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న సత్యవేడు నాయకులు


**విశాఖపట్నం, ఆగస్టు 18,జయ జయహే**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతంపై విశాఖపట్నంలో కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు. సత్యవేడు నియోజకవర్గం నుంచి ఏడు మండలాల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ , మరో ప్రధాన కార్యదర్శి సత్యవేడు మునికృష్ణయ్య తో పాటు వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దిలీప్ రాయల్ , నాగలాపురం మండల అధ్యక్షులు అయ్యప్ప, బి ఎన్ .కండ్రిగ మండల అధ్యక్షులు దాస్ గురునాథం, కె వి బి . పురం మండల అధ్యక్షులు బాబు, సత్యవేడు మండల అధ్యక్షులు సత్యవేడు బాలాజీ, పిచ్చాటూరు మండల అధ్యక్షులు కుబేంద్రన్, నారాయణవనం మండల అధ్యక్షులు కుమ్మరేషన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## నేడే మూలపేటలో గంగాలమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

**మునగపాక, ఆగస్టు 18, జయ జయహే:**

మునగపాక మండలంలోని మూలపేట గ్రామంలో గల గంగాలమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. బుధవారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు మధ్యాహ్న భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.






## ఓబిసి మోర్చా అధ్యక్షునిగా గోపాలశెట్టి శ్రీనివాసరావు

**అనంతగిరి, ఆగస్టు 18:( జయ జయహే)**

భారతీయ జనతా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అనంతగిరి మండల ఓ బి సి మోర్చా అధ్యక్షునిగా గోపాల శెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి కేంద్ర కాపీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అనంతగిరి మండల ఓ బి సి మోర్చా అధ్యక్షుడు గోపాల శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు. నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. గోపాల శెట్టి శ్రీనివాసరావు నియామకం పట్ల బిజెపి కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు, అనంతగిరి మండల అధ్యక్షుడు సోమరాజు, ప్రధాన కార్యదర్శిలు రామస్వామి, రామకృష్ణ,గోపాలరావు నియామకం మండలంలో ఓ బి సి మోర్చా బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు

# రిక్షా కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ

**విజయనగరం, ఆగస్టు 18: (జయ జయహే )**




మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలను పురస్కరించుకుని విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం రిక్షా కార్మికులకు రెయిన్‌కోట్లను మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, మెగా యూత్ ఫోర్స్ విజయనగరం జిల్లా అధ్యక్షులు చెల్లూరు ముత్యాల నాయుడు, మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధి, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు లోపింటి కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక కార్యకర్త, విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం తమ లక్ష్యమని అన్నారు. వర్షం, ఎండ అనే తేడా లేకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ వృత్తిని కొనసాగిస్తున్న రిక్షా కార్మికులను ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ మెగాభిమాని, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం గౌరవ సలహాదారులు సతీష్, మెగా ఫ్యామిలీ, జనసేన ప్రతినిధులు ముక్కి కుమార్,అలబోయిన శివ, రౌతు కుమార్,చుక్క రవి, వెంకటేష్,రాజేష్ పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి సమీక్ష.

**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 18,జయ జయహే.**

సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి కావడి నాగరాజు బి.ఎన్. కండ్రిగ మండలంలో జరుగుతున్న సర్ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. నోటీసుల పంపిణీ, సంబంధిత నోటీసులకు తీసుకోవాల్సిన ధృవీకరణ పత్రాలపై తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఆర్ ఐ నల్లయ్య,సూపర్వైజర్‌తో చర్చించి సూచనలు చేశారు.

## సీఎం పర్యటన విజయవంతం చేయండి

### హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల

**మాడుగుల ఆగస్టు 18 జయ జయహే**




రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22న మాడుగుల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా "స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని తర్వాత ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారనీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు మంగళవారం తెలిపారు. కాబట్టి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలకు కూటమి శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం మాడుగుల నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు స్వచ్ఛత, పచ్చదనం, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ప్రజలకు ముఖ్యమంత్రి గారు దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలో స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో "స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని కాబట్టి ప్రతి ఒక్కరు హాజరు కావాలన్నారు.



## విబిజి రాంజీ చట్టంపై ఎంపీటీసీలకు అవగాహన

**మాడుగుల ఆగస్టు 18 జయ జయహే**

ఎన్ఆర్ఈజీఎస్ పేరును జిబిజి రాంజీ పథకంగా పేరు మార్చుతూ ఈ పథకంలో జరిగిన మార్పులు గురించి ఎంపీటీసీలకు, ఎంపీపీలకు తెలియజేసేందుకు మంగళవారం మాడుగుల్లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నీటి యజమాని సంస్థ ఆధ్వర్యంలో పంచ సమ్మేళన్ పేరుతో వికసిత్ భారత్.. వి బి జి రాంజీ చట్టం గురించి మూడు మండలాల ఎంపీటీసీ సభ్యులందరికీ యోహాను కల్పించారు. ఈ సందర్భంగా మారిన పని దినాలు, వేతనాల వ్యత్యాసం, చేపట్టే పనులు వివరాలు వంటి వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ కే అప్పారావు, ఏపీ డీ బి శ్రీనివాస్, ఏపీ మురళి, జి రమేష్ మాడుగుల, బుచ్చయ్య పేట, రావికమతం, చీడికాడ, చోడవరం మండలం ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌కి స్వాగతం పలికిన కోలా

**శ్రీకాళహస్తి, ఆగస్టు 18,జయ జయహే.**

విశాఖపట్టణం లో నిర్వహించిన బీజేపీ సమావేశానికి విచ్చేసినబీజేపీ జాతీయ అధ్యక్షులునితిన్ నభిన్బీజేపీ రాష్ట్ర నాయకులు కోలాఆనంద్ స్వాగతం పలికారు.బీజేపీ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేసిన నితిన్ నబిన్ కి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కు కోలా స్వాగతం పలికారు.






## కుటుంబ సభ్యులు ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోండి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లాలో ఒకే ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల ఓట్లు వేరు వేరు ప్రాంతాల్లో వేర్వేరు పోలింగ్ బూత్ లో ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు కోరారు అనకాపల్లి జిల్లా డి ఆర్ ఓ వై సత్యనారాయణ కలిసి వారి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఒకే ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్ లలో ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భార్యాభర్తలు తల్లిదండ్రులు పిల్లలు ఒకే చిరునామాలు నివసిస్తున్నప్పటికీ వేరు వేరు బూత్ లలో కేటాయించడం వల్ల ముఖ్యంగా వృద్ధులు మహిళలు దివ్యాంగులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు ఒకే చోట ఓట్లు ఉండేలా ఆ బూతులో ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరడం జరిగింది ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగానే తుది జాబితా ప్రచురించే లోపే ఓటర్ల జాబితాలను పరిశీలించి ఒకే ఇంటి చిరునామాలు నివసిస్తున్న కుటుంబ సభ్యుల ఓట్లను ఎన్నికల నిబంధనలు పోలింగ్ కేంద్రాల పరిధిలోబడి ఒకే పోలింగ్ బూతులలో ఉండేలా చర్యలు తీసుకొని బూత్ బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన సవరణలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు



## క్రీడాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

**తిరుపతి, ఆగస్టు 18,జయ జయహే**


క్రీడాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు కమలాకర్ పేర్కొన్నారు.డీసీసీ అధ్యక్షులు బాలగురవంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు కమలాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ క్రీడలపట్ల విద్యార్థులను చైతన్యం చేసి క్రీడల వల్ల దేశం ముందడుగు వేస్తుందని, భావిభారత భవిష్యత్ పౌరులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.రాష్ట్ర క్రీడా విభాగ అధ్యక్షులు కమలాకర్ మాట్లాడుతూ నేడు దేశం లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదని ప్రతి దాంట్లో వెనుకబాటుతనం చోటు చేసుకుందని,క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువస్తే వారికి న్యాయం చేకూరేవరకు పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్,శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా,దేవదానం, మణి,జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్,జిల్లా కార్యదర్శులు ఇళయరాజా,గోపి,మాణిక్యం, రాష విభాగ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధ్యక్షులు రత్నం,మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఫయాజ్, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ,మండల అధ్యక్షులు తిరుమలై,షణ్ముగం,రఘునాథం,భాస్కర్, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.




## మౌనికకు అభినందనలు తెలిపిన కళాశాల బృందం

**చోడవరంఆగస్టు 18 జయ జయహే**


చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వై. మౌనిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుండి ప్రతిష్ఠాత్మకమైన "ఉత్తమ ఉద్యోగి" అవార్డు అందుకోవడం పట్ల చోడవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ , అధ్యాపక బృందం అభినందించింది. ఏపీ ఎస్ ఎస్ సి డి సి చైర్మన్ బూరుగపల్లి శేషారావు,మేనేజింగ్ డైరెక్టర్ జి. గణేష్ ఈ అవార్డును మౌనిక అందజేశారు అన్నారు. మౌనిక కృషి, అంకితభావం, బాధ్యతాయుతమైన సేవలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అందిస్తున్న విశేష సేవలకు ఈ అవార్డు గొప్ప గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. సి హెచ్ ఎస్ అనురాధ, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ ఎం. రాజేశ్వరరావు, అకాడమీ కోఆర్డినేటర్ డా. ఎస్. మల్లిబాబు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డా. జి. రాజకుమార్ తదితరులు మౌనిక నీ అభినందించిన వాటిలో ఉన్నారు.



## ఈ రెండు సమస్యలు పరిష్కరించండి అధ్యక్షా

**చోడవరం ఆగస్టు 18 జయ జయహే**

చోడవరం నియోజవర్గంలో ప్రధానంగా నిలిచిన ఈ రెండు సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజు అసెంబ్లీలో స్పీకర్ను కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా భీమునిపట్నం నర్సీపట్నం రహదారి అధ్వానంగా ఉందని దానిని గుంతలు లేని రోడ్డుగా తయారు చేయాలని రాకపోకలకు, రవాణా సౌకర్యాలకు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా గోవాడ చెరుకు రైతుల బకాయిలు సిబ్బంది జీతభత్యాలు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత మంత్రులు స్పందించి ఈ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. గతంలో కూడా ఈ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. ఇవి పరిష్కారం అయితే ఇక పెద్దగా సమస్యలు ఉండవన్నారు.



## లోకోస్ లావాదేవీల నమోదుతో గ్రామ సంఘాలు పటిష్ఠం

### ఏపియం మునెయ్య

**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 18,జయ జయహే.**

వెలుగు కార్యాలయం లో మంగళవారం విఓఏ లకు లోకోస్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లోక్ అంటే ప్రజలు ఓ అంటే ఆపరేషనల్ యస్ అంటే వ్యవస్థ పూర్తిగా లోకోస్ అంటే ప్రజలు చే నిర్మించబడే వ్యవస్థఅని ఏ పి ఎం మునయ్య తెలిపారు.దీని ద్వారా మహిళా సంఘాలు గ్రామ సంఘాలు లావాదేవీలు దేశం మొత్తం జాతీయ గ్రామీణ జీవనోపాధులు మిషన్ ఆధ్వర్యంలో ఒకే రకమైన విధంగా నమోదు చేయడం జరుగుతుందన్నారు.అనంతరం లీగల్ కో-ఆర్డినేట్ గెరటా రెడ్డి, సిసి పయనీ లోకోస్ పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిసి లు వెంకట రత్నం, జీవ, అకౌంటెంట్ లు హిమగిరిజ, శిరీష, మండల సమాఖ్య లీటర్లు, సంఘమిత్ర లు పాల్గొన్నారు.

## ఇందిరా మృతికి మాజీ మంత్రులు సంతాపం

**మాడుగుల ఆగస్టు 18 జయ జయహే**




మాడుగుల మాజీ ఎంపీపీ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ సతీమణి వేమవరపు ఇందిర ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడు ప్రసాద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల అనురాధ, నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు, సి డి సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీపీ టీవీ రాజారాం తదితరులు సంతాపం తెలిపారు. మంగళవారం మాడుగుల లో ఆమె స్వగృహంలో స్వగృహం వద్ద భౌతికకాయంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సందర్భంగా ధర్మజా కుటుంబానికి సంతాపం తెలుపుతూ ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, జడ్పిటిసి కే రమణమ్మ, మండల ఉపాధ్యక్షులు పి విజయలక్ష్మి, కే శ్రీనివాసు, మాజీ సర్పంచులు వై కళావతి,డి సూర్యరావు, పార్టీ నాయకులు పి వెంకటరావు, ఎస్ శ్రీనివాసరావు ,బి శ్రీనివాసు, బూరే బాబురావు, డైరీ డైరెక్టర్ సీరం రెడ్డి సూర్యనారాయణ,పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, నాలుగు మండలాల చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంతాపం తెలిపారు.

# ఘనంగా సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

**అనకాపల్లి (జయ జయహే)**

ఎన్టీఆర్ రింగ్ రోడ్ కొణతాల వారి వీధి శ్రీ లక్ష్మీ శ్రీనివాస కళ్యాణ్ మండపం ఎదురుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 18 వ వర్ధనతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళు లు అర్పిస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్, అనకాపల్లి జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రేభాక మధు, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతా లక్ష్మణ్, ఎన్.సి.సి ధర్మలింగం, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఒక మిస్టరీగా ఉండిపోయింది ప్రాణం ఎవరిది అంటే అది నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశం ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆగస్టు 18,వ తేదీన ప్రభుత్వం తన మరణాన్ని ప్రకటించింది. కానీ ఇప్పటివరకు కూడా ఆయన మృతి దేహానికి అంత్యక్రియలు ఇప్పటివరకు కూడా జరగలేదు. తన ప్రాణాలను లెక్కచేయకుండా స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మహనీయులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర ,ఆజాద్ హింద్ ఫౌజ్' సైన్యాన్ని ఏర్పాటు చేసి భరత మాత దాస్య శృంఖలాలను తెంచేందుకు నిర్విరామ కృషి చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆయన పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా ఈనాటికీ చెప్పుకుంటున్నారు . ఈ కార్యక్రమంలో హేమ శేఖర్ కాలేజ్ విద్యార్థి,విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు





## మోదకొండమ్మ వారి మకర తోరణానికి విరాళం

**మాడుగుల ఆగస్టు 18 జయ జయహే**

మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మోదకొండమ్మ వారికి పంచలోహ మకర తోరణం నిమిత్తం గ్రామానికి చెందిన ఉడత వెంకటరమణ ఆనంద కొండలరావు అప్పలరాజు గుప్తా కుమారులు 30 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లీ సంజీవరావు సమక్షంలో ఆలయంలో అందజేశారు. దీంతో దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు, రావాలా కాంతారావు, అప్పన్న నాయుడు, కలిమి గోపాల్, పోతిన జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో వారాహి మాత ఆలయం నిర్మాణంలో ఉందని కాబట్టి ఎవరైనా విరాళాలు ఇచ్చే దాతలు ఉంటే కమిటీ వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.




## దండకారణ్య కాలేజీ హాస్టల్‌కు పూర్తిస్థాయి వార్డెన్ నియమించాలి

### రిటైర్డ్ ఉపాధ్యాయుడితో హాస్టల్ నిర్వహణ..తల్లిదండ్రుల ఆందోళన

### 350 మంది విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు

**అరకులోయ: ఆగస్టు 18. జయ జయహే**

అరకులోయ మండల కేంద్రంలోని దండకారణ్య జూనియర్ కళాశాల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌కు (బాయ్స్3) (జి. 4) పూర్తిస్థాయి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను వెంటనే నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. వసతి గృహాల్లో సుమారు 350 మంది ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులు, విద్యార్థినులు వసతి పొందుతున్నారు. గతంలో హాస్టల్ బాధ్యతలు నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను 2026 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేసినప్పటికీ, ఆయన స్థానంలో ఇప్పటివరకు పూర్తిస్థాయి హెచ్ డబ్ల్యు ను నియమించలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడితోనే హాస్టల్ నిర్వహణ కొనసాగించడం సరైన విధానం కాదని వారు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయి హెచ్ డబ్ల్యు లేకపోవడంతో హాస్టల్ లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదా, పారిశుద్ధ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి, వసతి గృహ నిర్వహణ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించే పరిస్థితి లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో సుమారు 150 మంది బాలికలు వసతి పొందుతున్న నేపథ్యంలో వారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, భోజనం, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్యార్థుల సమస్యల పరిష్కారం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించేందుకు అర్హత కలిగిన పూర్తిస్థాయి హెచ్ డబ్ల్యు ను తక్షణమే నియమించాలని కోరుతున్నారు. అరకులోయ ఏ టి డబ్ల్యూను ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి హెచ్ డబ్ల్యును నియమించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.



## జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలో సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 18,జయ జయహే.**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తిరుపతిలోని రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలో స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో మూడవ తరగతి విద్యార్థిని ఎన్.ప్రజ్ఞశ్రీ ప్రత్యేక బహుమతి సి.4 విద్యార్థి ఎన్ ధ్రువ చాణక్య ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థుల విజయం వెనుక నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న వారి తల్లి స్వాతి ని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ సృజనాత్మకత విజయానికి కారణమైతే,మీ కృషి మీ తదుపరి విజయానికి మార్గం అవుతుందన్నారు. మీరు సాధించిన ఈ విజయం రంగుల ప్రపంచంలో విజయం అనే వర్ణం అని అన్నారు. ఏజీఎం సురేష్ విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. ఇలాంటి పోటీల్లో మరింత ఉత్సాహంగా పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బాలాజి, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇంచార్జ్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టుకు భోగాపురం పేరు ఎందుకు పెట్టలేదు

### భోగాపురం పేరు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక

### మాజీ మంత్రి పతివాడ

### లోక్ సత్తా పోస్ట్ కార్డు ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

**విజయ నగరం, ఆగస్టు 18, జయ జయహే :**



విజయనగరం జిల్లా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రస్తుతం ఉన్న పేర్లు అన్నిటితో పాటు భోగాపురం పేరుని జోడించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు అన్నారు మంగళవారం పద్మావతినగర్ లోని తన పెద్ద కుమారుడు డాక్టర్ రామునాయుడు గృహంలో లోక్ సత్తా ప్రారంభించిన పోస్టు కార్డు, సంతకాల ఉద్యమాన్ని అయన ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాను శాసనసభ్యునిగా ఉన్నప్పుడే అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూ సేకరణ జరిగి పనులు ప్రారంభమయ్యాయని 2,750 ఎకరాల భూమి ఇచ్చిన రైతుల, వారి కుటుంబాల మనోభావాలు, జిల్లా ప్రజల ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవాలని, భోగాపురం పేరు నియోజకవర్గం ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పతివాడ అన్నారు, భోగాపురం పేరు తరువాతే విశాఖపట్నం వీటిజెడ్, జీఎంఆర్, ఏరో పేరువుండాలని పట్టు పట్టారు నియోజకవర్గం ప్రజల్లో అసంతృప్తి పెరగక ముందే భోగాపురం పేరుని త్వరగా జోడించాలని కోరుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున లకు పోస్టు కార్డులు పంపారు లోక్ సత్తా సంతకాల ఉద్యమం లో భాగంగా పతివాడ తొలి సంతకం చేశారు,ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడితూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అని ప్రస్థావిస్తున్నారని విమానాశ్రయం దగ్గర భోగాపురం బోర్డు ఎందుకు పెట్టలేదని ఎమ్మెల్యేలను, మంత్రులను నిలదీయ లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం లో జిల్లా ప్రతినిధులు అల్లంశెట్టి నాగభూషణం, బోర రమేష్, పౌర వేదిక ఉపాధ్యక్షులు పిడకల ప్రభాకరరావు, కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు

## దాసుకుప్పం బైపాస్‌లో ఆసుపత్రి మంజూరు చేయండి ఎమ్మెల్యే అధిమూలం


**సత్యవేడు, ఆగస్టు 18,జయ జయహే.**



సత్యవేడులో చిరకాలంగా నోచుకోని దాసు కుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం, ఏరియా ఆసుపత్రి మంజూరు చేయాలని ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకోరారు. పుత్తూరు నుండి సత్యవేడు వెళ్ళే రోడ్డు ఊత్తుకోట వద్ద ఒక కిలోమీటరు మేర తమిళవాడు లో వెళ్లాల్సి వస్తోందని కరోనా సమయంలో ఎమ్మెల్యే అయిన తన వాహనంతో పాటు మన రాష్ట్రానికి చెందిన వాహనాలన్నింటిని తమిళనాడు ప్రభుత్వ వెళ్లకుండా అడ్డుకుందని వివరించారు. నియోజకవర్గ కేంద్రం సత్యవేడు తో పాటు, అటువైపు ఉన్న శ్రీ సిటీలోని 300 కంపెనీలకు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉందని చెప్పారు. దాసుకుప్పం వద్ద 2.5 కిలో మీటరు మేర బైపాస్ ఏర్పాటు చేసుకుంటే తమిళనాడు ప్రభుత్వంతో మన వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు ఈ సమస్యను అధిగమించడానికి గత ప్రభుత్వం దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేస్తూ జీఓ ను సైతం జారీ చేసిందని, అయితే ప్రభుత్వం, అధికారులు మారిపోవడం వల్ల పనులు జరగలేదని ఎమ్మెల్యే వివరించారు. సత్యవేడులో ఏరియా ఆసుపత్రి మంజూరు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏపీ అసెంబ్లీలో కోరారు.

## వరల్డ్ వైడ్ గవర నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం

**అనకాపల్లి జయ జయహే**



స్థానిక గవరపాలెం ప్రాంతంలో గల గవర కమ్యూనిటీ వరల్డ్ వైడ్ గవర హెల్ప్ నీడ్ జేఏసీ అను నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం సాయంత్రం నూకాంబిక దేవస్థాన సమీపంలో గల సత్యా గ్రాండ్ కల్యాణ మండపంలో ఈ ప్రమాణ స్వీకారం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు గౌరీ సేవా సంఘం చైర్మన్ కర్రీ సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన గవర కమ్యూనిటీ వారికి పిలుపునివ్వడం జరిగింది ఎప్పటికీ గౌర కమ్యూనిటీ సంఘం ద్వారా ఎందరో సహాయం అందిస్తున్నామని నిరుపేద విద్యార్థులకు స్కాలర్షిప్లు కూడా ఇవ్వడం జరుగుతుందని ఇంకా ఎన్నో మంచి మంచి కార్యక్రమాలు కూడా ఈ సంఘం ద్వారా జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు ఇన్కమరంత సంఘాన్ని విస్తరించి మరింత సహాయం అందించాలని సదుద్దేశంతో ఈ సంఘం ముందుకు వెళుతూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు



## స్టీల్ సిటీ డిపో నూతన మేనేజర్ శ్రీనివాసరావుతో బలిరెడ్డి భేటీ

**అగనంపూడి, ఆగస్టు 18, జయ జయహే :**

కూర్మన్నపాలెం వద్ద ఉన్న విశాఖ స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో నూతన్ మేనేజర్ పి శ్రీనివాస్ ను ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆగనంపూడి ప్రాంత ప్రజలకు బస్సుల సమస్యలపై చర్చిండం జరిగింది. అగనంపూడి పునరావాస కాలనీలో గతంలో 76 నెంబర్ బస్సు తిరిగేదని అది ఇప్పుడు తిరగడం లేనందున ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ బస్సును పునరుద్దరించడంతో పాటు అగనంపూడి సెంటర్లో లక్షలాది రూపాయలు ప్రభుత్వ నిధులతో బస్సు షెల్టర్ నిర్మించినప్పటికీ ఆర్టీసీ బస్సులు అక్కడ ఆగడం లేదని, ఉదయం పూట కాలేజీ పిల్లలు ఉద్యోగులు విధి నిర్వహణలకు వెళ్ళినప్పుడు బస్సులో చాలా రద్దీగా ఉంటున్నాయని బస్సులు ఆపటం లేదని కావున ఆర్టీసీ స్టాఫ్ ని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ త్వరలో ఆ ప్రాంతం సర్వే చేసి తగులు చర్యలు తీసుకుంటామని అన్నారు. బీజేపీ నాయకులు అంగుళూరు ఈశ్వరరావు, విశాఖ జిల్లా హ్యూమన్ రైట్స్ డిప్యూటీ సెక్రటరీ ఎస్ సుబ్రమణ్యం, కార్మిక నాయకులు పట్నాయక్ శనివాడ చిన్నారావు, ఆర్టీసీ అధికారులు బి రామకృష్ణ , బి బాను , వెంకటేశ్వరరావు, డి లక్ష్మి పాల్గొన్నారు




## పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి

**తెనాలి జయజయహే న్యూస్:**

2026 ఆగస్టు 18 గుంటూరు జిల్లా, తెనాలి మండలం కఠెవరం గ్రామం లో ఉన్న కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ లో మంగళవారం కీర్తిశేషులు, స్వర్గీయ వేణుగోపాల్ యాదవ్ గారి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులు యాతమ్ బోగాది, నాగేశ్వరి గార్ల సహకారంతో చిన్న పిల్లలకు, అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ నండూరి కార్తీక్ మాట్లాడుతూ కీ"శే" స్వర్గీయ వేణుగోపాల్ యాదవ్ గారి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లితండ్రులు, మరియు కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేయడం జరిగిందని, వేణుగోపాల్ యాదవ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఇలా పుట్టినరోజున అన్నదానం ఏర్పాటు చేసిన యాతమ్ భోగాది, నాగేశ్వరి గార్లకు ఆ దేవుని చల్లని దీవెనలు, ఆశీస్సులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఈ కార్యక్రమానికి సహకారం అందించిన కీ"శే" వేణుగోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులందరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగా ఫ్యామిలీ అభిమానుల ఆత్మీయ సమావేశం





**విజయనగరం: (జయ జయహే)**

విజయనగరం జీఎస్ఆర్ ఇంటర్నేషనల్ హోటల్‌లో మెగా ఫ్యామిలీ అభిమానుల ఆత్మీయ సమావేశం వైభవంగా నిర్వహించారు. మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీ సభ్యుల నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు- రాధిక దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని వెల్లడించారు. మెగా యూత్ ఫోర్స్ జిల్లా అధ్యక్షులు చెల్లూరి ముత్యాల నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొయ్యాన లక్ష్మణ్ , టీమ్ ప్రతినిధుల సమక్షంలో ఈ నియామకాలు జరిగాయి.సమావేశంలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లా మెగా ఫ్యామిలీ సీనియర్ అభిమానులను, విజయనగరం థియేటర్ల మేనేజర్లను, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ ఏజెంట్లను నిర్వాహకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గురాన అయ్యలు మాట్లాడుతూ... మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవలో ముందంజలో ఉన్న అభిమానుల సమైక్యతను, నాయకత్వ లక్షణాలను గుర్తించే ఈ కొత్త కమిటీ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. చిరంజీవి సేవా సిద్ధాంతాలను, సామాజిక కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పలువురు సీనియర్ అభిమానులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన మెగా సీనియర్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!



గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷-రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టీసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# పోర్ట్ కాలుష్యంపై ప్రశ్నించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు**

**పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలకు డిమాండ్**

**అమరావతి, ఆగష్టు 18, జయ జయహే**



విశాఖ నగరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పోర్ట్ కాలుష్య సమస్యపై దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గళమెత్తారు. విశాఖ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పోర్ట్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సుందరమైన, ఆహ్లాదకరమైన విశాఖ నగరం పోర్ట్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు పోర్ట్ కార్యకలాపాల కారణంగా ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని, ప్రజలు ఇళ్లలోనే కాకుండా రోడ్లపై కూడా దుమ్ము కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. పోర్టులోని బెర్తులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించడం వల్ల పోర్ట్ యాజమాన్య పర్యవేక్షణ కొంత మేర తగ్గిందని, కొంతమంది ఆపరేటర్లు పర్యావరణ నియమాలను పూర్తిస్థాయిలో పాటించకపోవడం వల్ల కాలుష్య సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. సీ పోర్ట్ వంటి సంస్థలు కొన్ని నిబంధనలు పాటిస్తున్నప్పటికీ, మిగిలిన ఆపరేటర్లు కూడా తప్పనిసరిగా అన్ని పర్యావరణ ప్రమాణాలను పాటించేలా కఠిన పర్యవేక్షణ ఉండాలని కోరారు. బల్క్ కార్గో, ముఖ్యంగా బాక్సైట్ వంటి ధూళి రేణువులు ఎక్కువగా వ్యాపించే సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో తప్పనిసరిగా వాటర్ స్ప్రింక్లింగ్ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. స్టాక్స్‌ను పూర్తిగా తార్పాలిన్లతో కప్పి ఉంచాలని, రవాణా సమయంలో లారీలపై కార్గోను పూర్తిగా కప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోర్ట్ పరిధిలో స్టాక్ యార్డుల వద్ద, రోడ్లపై పేరుకుపోయే దుమ్మును నియంత్రించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని తెలిపారు. కేవలం నీటిని పిచికారీ చేయడం వల్ల దుమ్ము వాహనాల టైర్లకు అంటుకుని నగరంలోకి వ్యాపించే అవకాశం ఉందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక డస్ట్ క్లీనింగ్ యంత్రాల సంఖ్యను పెంచాలని సూచించారు. "పోర్ట్ అభివృద్ధి అవసరమే.. కానీ ఆ అభివృద్ధి కోసం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమతుల్యంగా కొనసాగాలి" అనే స్పష్టమైన సందేశాన్ని ఎమ్మెల్యే శాసనసభ వేదికగా వినిపించారు



# గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సహాయం అందించాలి...!

**గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్**

**విశాఖపట్నం, ఆగష్టు 18, జయ జయహే**

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సీఎస్సార్ నిధులు ఇచ్చే దాతల సహాయం కావాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ కోరారు. విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ యొక్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సర్వ సభ్య సమావేశం మంగళవారం సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. బడ్జెట్ రూ.43.06 కోట్లు (జీతాలు, ఫించను గ్రాంటు 16.35 కోట్లు మరియు అడ్మినిస్ట్రేషన్ రూ.27.25కోట్లు) అంచనాలు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఆమోదించిన నూతన బడ్జెట్ కమిటీ ముందు ఉంచారు. ఈ సమావేశంలో పాలక వర్గ సభ్యుల ఆమోదం నిమిత్తం పలు కీలక అంశాలు మరియు అభివృద్ధి ప్రతిపాదనలు చర్చించారు. నూతన భవనాల నిర్మాణం: జి.కె.వీధి, అనంతగిరి, ముంచుగుపుట్టు మరియు విశాఖపట్నం అన్ని నియోజకవర్గం లో సొంత భవన నిర్మాణం కొరకు ప్రభుత్వం నుండి స్థలాల ఉత్తర్వులు రాగానే ఏపీఈడబ్ల్యుఐడీసీ ద్వారా అంచనాలు కోరి, నూతన భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతి నిమిత్తం సంచాలకుల వారికి పంపించేందుకు తీర్మానించడమైనది. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న తాల్లపాలెం శాఖా గ్రంథాలయ భవన పునర్నిర్మాణానికి ఏపీఈడబ్ల్యుఐడీసీ వారి నుండి ప్లాన్ మరియు అంచనాలు రప్పించి పరిపాలనా ఆమోదానికి సంచాలకుల వారికి సమర్పించుటకు నిర్ణయించారు. గ్రంథాలయ పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కంటిన్యూగా నిర్వహించేందుకు కమిటీ తీర్మానించామని తెలిపారు. ఈ సమావేశములో విద్యాశాఖ ఎ.డి. గోపి కృష్ణ , వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్య వర్మ, సమాచార శాఖ ప్రతినిధుల జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి,కుమార్ రాజు, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక సమస్యలపై ఏఐటియుసి మహాధర్నా

**తిరుపతి, ఆగస్టు 18,జయ జయహే.**

సిపిఐ పార్టీ జాతీయ కమిటీ పిలుపుతో మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నానిర్వహించారు. ఈ మహా ధర్నాకు సిపిఐ పార్టీ జిల్లా నాయకులు,ఏఐటీయూసీ జిల్లా నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సౌర కణాల తయారీకి

# పరిశోధనలే కీలకం

**ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎల్ గిరిబాబు**

**విశాఖపట్నం, ఆగష్టు 18, జయ జయహే**





అనేక దశాబ్దాలుగా సౌర కణాల తయారీకి అనువైన, సమర్థవంతమైన పదార్థాలను అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు నిర్వహిస్తున్నారని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డా. ఎల్. గిరి బాబు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం ఆయన ఫోటోవోల్టాయిక్స్ (సౌర కణాలు) అంశంపై ప్రసంగిస్తూ సౌర కణాల అభివృద్ధిలో చోటుచేసుకున్న వివిధ దశలను వివరించారు. సూర్యకాంతిని విద్యుత్ శక్తిగా మార్చే పరికరమే సౌర కణమన్నారు. సూర్యకాంతి శక్తిని విద్యుత్ శక్తిగా సమర్థవంతంగా మార్చేందుకు అనువైన పదార్థాలతో సౌర కణాలను నిర్మిస్తారని వివరించారు. అయితే, సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ప్రక్రియలో గరిష్ఠ క్వాంటం సామర్థ్యం సాధించడం అనేక సవాళ్లతో కూడుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఫోటోవోల్టాయిక్ పరిశోధన రంగంలో తన బృందం చేసిన పరిశోధనలు, అందించిన సేవలు మరియు సాధించిన పురోగతిని డా. గిరి బాబు సవివరంగా వివరించారు. సౌర శక్తి రంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక పరిణామాలు, భవిష్యత్ అవకాశాలపై కూడా ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యజీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.ఎస్.కె. చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. దీపక్ చౌదరి, డీన్ క్యాంపస్ కోఆర్డినేషన్ కె. సోమేశ్వర రెడ్డి, కెమిస్ట్రీ ప్రొఫెసర్, కెమికల్ రీసెర్చ్ విభాగాధిపతి డా. జి.వి.ఆర్. శర్మ డా. ఎల్. గిరి బాబును ఘనంగా సత్కరించారు. ఈ అతిథి ఉపన్యాసంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు (ఃణం), అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com